'రావి' లేఖతోనే అధికారికంగా విమోచనం

- సెప్టెంబర్ 17న నిర్వహించేందుకు కేంద్రం ఆమోదం
- 12న గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన హోంశాఖ

హైదరాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ): తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఏటా సెప్టెంబర్ 17న అధికారికంగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని ప్రకటిస్తూ కేంద్ర హోంశాఖ ఈ నెల 12న గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. రావి నారాయణరెడ్డి సేవా సంస్థ ఇటీవల రాసిన లేఖకు స్పందించి కేంద్రం ఈ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. 1948 సెప్టెంబర్ 17న కేంద్ర ప్రభుత్వం నిజాం నవాబుకు వ్యతిరేకంగా 'ఆపరేషన్ పోలో' పేరుతో పోలీస్ చర్య చేపట్టడంతో హైదరాబాద్ సంస్థానం భారత్‌లో విలీనమైన విషయాన్ని వివరిస్తూ గత నెల 16న ప్రధానికి ఓ లేఖ రాశామని, ఆ లేఖకు మోదీ స్పందించి తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించేందుకు ఆమోదం తెలిపారని సంస్థ ప్రతినిధులు వెల్లడించారు.

ప్రజాపాలనలో ఉద్యమకారులకు చోటివ్వండి

దీపాదాస్ మున్షీకి బీసీ రాజ్యాధికార సమితి విజ్ఞప్తి

హైదరాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ): వచ్చే తెలంగాణ పార్లమెంట్ ఎన్నికల్లో కనీసం 8 సీట్లను బీసీలకు కేటాయించాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై ఆదివారం తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని ప్రత్యేకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఉదయపూర్ డిక్లరేషన్‌కు అనుగుణంగా మెజార్టీ సీట్లను బీసీలకు కేటాయించి వాగ్దానాన్ని నెరవేర్చాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో పదవులన్నీ ఒకే సామాజికవర్గానికి కేటాయించడం ద్వారా సబ్బండ వర్ణాలను నిరుత్సాహానికి గురి చేసిందని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు 22 సీట్లను మాత్రమే కేటాయించి ఉదయపూర్ డిక్లరేషన్‌కు తిలోదకాలిచ్చిందని గుర్తుచేశారు. తాజాగా ప్రభుత్వం ప్రకటించిన 37 కార్పొరేషన్లలో బీసీలకు 13 మాత్రమే ఇచ్చిందని అసంతృప్తి వ్యక్తంచేశారు. ప్రజా, ఉద్యమ నాయకులకు నామినేటెడ్ పదవుల అవకాశాన్నిచ్చి ప్రోత్సహించాలని మున్షీని కోరారు. ఉపకులాలకు సైతం ఫెడరేషన్లను, కార్పొరేషన్లను ఏర్పాటు చేయాలని, బీసీలకు ఎస్టీలకు డిప్యూటీ సీఎంగా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

హనుమకొండలోని హయగ్రీవాచారి మైదానంలో ఆటోషో స్టాళ్ల వద్ద వినియోగదారుల సందడి

ఎమ్మెల్యే కడియం శ్రీహరికి జ్ఞాపికను అందజేస్తున్న నమస్తే తెలంగాణ బ్రాంచి మేనేజర్, చిత్రంలో బ్యూరో ఇన్‌చార్జి, సిబ్బంది

ఆటోషో గ్రాండ్ సక్సెస్

- నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే ఆధ్వర్యంలో రెండురోజులు నిర్వహణ
- ప్రదర్శనలో కంపెనీల కార్లు, బైకులు కొనుగోలు చేసిన వినియోగదారులు
- నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడేకు కొనుగోలుదారుల ప్రత్యేక కృతజ్ఞతలు

హనుమకొండ చౌరస్తా, మార్చి 17: హనుమకొండలోని కుడా హయగ్రీవాచారి మైదానంలో నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆటోషో గ్రాండ్ సక్సెస్ అయింది. శని, ఆదివారాలు (రెండురోజులపాటు) నిర్వహించిన ఆటోషోలో ప్రముఖ కంపెనీలకు చెందిన కార్లు, బైకులను ప్రదర్శనకు పెట్టారు. మహావీర్ బెంజ్, మహావీర్ స్కోడా, కృష్ణ వోల్వో, ఆడి హైదరాబాద్, ప్రైడ్ జీప్, పీపీఎస్ వోల్క్స్‌వాగన్, విన్ టీవీఎస్, విన్ మోటార్స్, మోటార్‌లైన్ మహీంద్ర, మిత్ర సుజికి, కియామోటార్స్, ఆదర్శ మోటార్స్, ఆదర్శ నెక్సా, గ్రీన్‌హోండా, హ్యాపీ ఆటోమోటివ్ యమహా, హేమా హుందాయ్, ప్రైడ్ సిట్రోన్, ఎంజీ మోటార్స్, మహావీర్ జేఎస్‌యూజెడ్‌యూకు చెందిన యాజమాన్యాలు తమ లేటెస్ట్ కార్లు, బైక్‌లను ప్రదర్శనలో పెట్టాయి. ఆధునిక టెక్నాలజీతో పాటు సరికొత్త ఫ్యూచర్లతో పలు కంపెనీలకు చెందిన ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు, కార్లు ఆటోషోలో ఆకట్టుకున్నాయి. ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు పెరగడంతో వినియోగదారులు వాటిపై ఆసక్తి చూపించారు. స్టాళ్ల సందర్శనకు వచ్చినవారిని ప్రోత్సహించేందుకు నమస్తే తెలంగాణ బంపర్ డ్రా ఏర్పాటు చేసింది. డ్రాలో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ప్రతి రోజూ మూడు లక్కీ డ్రా ద్వారా కూపన్లు తీసి విజేతలకు బహుమతులు అందజేశారు.

వాహనాల టెస్ట్ డ్రైవ్

ఆటో షోకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన వాహన ప్రేమికులు వాటి కొనుగోలుకు ఆసక్తి చూపారు. కంపెనీ నిర్వాహకులు కార్లు, బైకుల విశేషాలను కొనుగోలుదారులకు వివరించారు. కారు, బైక్ మోడళ్ల వివరాలను కొనుగోలుదారులు అడిగి నివృత్తి చేసుకున్నారు. కొందరు వెంటనే కార్లు, బైక్‌లను కొనుగోలు చేశారు. ఆటోషోకు వచ్చిన వినియోగదారులు తమకు నచ్చిన వాహనాలను టెస్ట్ డ్రైవ్ చేశారు. ఎక్కువగా ఓల్డ్ ఈజ్ గోల్డ్ అన్నట్లుగా చేతక్ వాహనాలపై తిరిగారు. నచ్చిన కార్ల గురించి తెలుసుకొని అందులో చక్కర్లు కొట్టారు. వాహనాలు కొనాలనుకునే వారి కోసం అనేక రకాల వాహనాలు ఒకే వేదికపైకి తీసుకొచ్చిన నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇక ముందు మరిన్ని షోలు: సురేందర్‌రావు

ప్రజల సౌకర్యార్థం నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆటో షోలకు అన్ని జిల్లాల్లో ప్రజల నుంచి విశేష స్పందన వస్తున్నదని నమస్తే తెలంగాణ అడ్వర్‌టైజ్‌మెంట్ జనరల్ మేనేజర్ ఎన్ సురేందర్‌రావు చెప్పారు. గతంలో ఇలాంటి షోలు ఢిల్లీ, హైదరాబాద్ వంటి మహానగరాలకే పరిమితమయ్యేవని, ఇప్పుడు మన నగరాల్లో కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.ప్రజలకు అన్ని వాహనాలు ఒకే వేదికపైకి తీసుకొచ్చేందుకు ఆటోషో ఎంతో ఉపయోగపడుతున్నదని పేర్కొన్నారు. ఇక ముందు కూడా మరిన్ని షోలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నమస్తే తెలంగాణ వరంగల్ బ్రాంచ్ మేనేజర్ పందిళ్ల అశోక్‌కుమార్, ఏజీఎం రాజిరెడ్డి, బ్యూరో ఇన్‌చార్జి పిన్నింటి గోపాల్, యాడ్ మేనేజర్లు అప్పని సూరయ్య, శ్రీచరణ్ ఆనంద్, సర్క్యులేషన్ మేనేజర్ ఎడెల్లి సురేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి చెందుతున్న వరంగల్ నగరం : ఎమ్మెల్యే కడియం శ్రీహరి

రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం వరంగల్ అని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. ఆటో షో ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఈ ఆటో షో ద్వారా ప్రముఖ కంపెనీల కార్లు, ద్విచక్ర వాహనాల సరికొత్త మాడల్స్‌ను ఒకే వేదికపై వాహన ప్రేమికుల కోసం ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. వార్తలను ప్రచురించడమే కాకుండా ప్రజా అవసరాలను గుర్తించి గతంలో ప్రాపర్టీ షోలు, ఇపుడు ఆటో షో నిర్వహించారని తెలిపారు. పత్రికల ఆధ్వర్యంలో ఇలాంటి సామాజిక సేవలు నిర్వహించడం చాలా సంతోషకరమని కొనియాడారు. టాప్ మాడల్స్ కంపెనీలు వరంగల్‌లాంటి నగరంలో ఆటోషోలు పెడితే కస్టమర్లకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.

రామప్ప శిల్పకళ అత్యద్భుతం

- హైకోర్టు సీజే జస్టిస్ అరాధే
- జడ్జీలతో కలిసి ఆలయాల సందర్శన

వెంకటాపూర్, మార్చి 17: రామప్ప శిల్పకల అత్యద్భుతమని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే కొనియాడారు. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేటలోని రామప్ప ఆలయాన్ని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తులతో కలిసి జస్టిస్ అలోక్ అరాధే దంపతులు సందర్శించారు. హనుమకొండలోని చారిత్రక వేయిస్తంభాల గుడి, ములుగులోని గట్టమ్మ ఆలయాన్ని సందర్శించారు. అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ మండపంలో వారిని శాలువాలతో సన్మానించి, ఆశీర్వచనం అందజేశారు. వీరి వెంట హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ లక్ష్మణ్, నామవరపు రాజేశ్వర్‌రావు, జస్టిస్ వినోద్ కుమార్, రిజిస్ట్రార్లు నందికొండ నర్సింగరావు, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధేతో న్యాయమూర్తులు, అధికారులు

త్వరలో ఐఐటీహెచ్‌కు నూతన డైరెక్టర్

- సమ్మక్క సారక్క గిరిజన వర్సిటీకి కూడా
- నోటిఫికేషన్ జారీచేసిన కేంద్ర ప్రభుత్వం
- ఆశావహుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ): ప్రతిష్ఠాత్మక ఐఐటీ హైదరాబాద్‌కు త్వరలో నూతన డైరెక్టర్ నియమితులుకానున్నారు. ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేసిన కేంద్రం.. ఆశావహుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నది. ప్రస్తుతం ఐఐటీహెచ్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ బీఎస్ మూర్తి కొనసాగుతున్నారు. మద్రాస్ ఐఐటీలో ప్రొఫెసర్‌గా పనిచేసిన ఆయన ఐదేండ్ల క్రితం ఐఐటీహెచ్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఆయన పదవీకాలం త్వరలోనే ముగియనుండటంతో నూతన డైరెక్టర్‌ను కేంద్రం నియమించనున్నది. రాష్ట్రంలో ఇటీవలే ఏర్పాటైన సమక్క సారక్క గిరిజన వర్సిటీకి కూడా నూతన వీసీ నియామకానికి కేంద్రం నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దరఖాస్తులు ఆహ్వానిస్తున్నది. ఈ వర్సిటీలో బీఏ ఆనర్స్ (ఇంగ్లిష్), బీఏ ఆనర్స్ (సోషల్ సైన్సెస్) కోర్సులను నిర్వహిస్తున్నారు. సీయూఈటీ (యూజీ) స్కోర్ ఆధారంగా ఈ రెండు కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) వీసీని ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు అప్పటించారు.

'సీపీఎస్‌పై రాజకీయ పార్టీల వైఖరేంటి ?'

హైదరాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ) : పెన్షన్‌భారం పెరుగుతోందన్న సాకుతో పాత పింఛన్‌ను రద్దు చేసి సీపీఎస్‌ను అమలు చేయడం దుర్మార్గమని, దీనిపై రాజకీయపార్టీలు తమ విధానాన్ని, వైఖరిని ప్రకటించాలని ఆలిండియా సెకండరీ టీచర్స్ ఫెడరేషన్ (ఏఐఎస్‌టీఎఫ్) ప్రశ్నించింది. హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ కార్యవర్గ సమావేశంలో సంఘం జాతీయ అధ్యక్షుడు ఇంద్రశేఖర్ మిశ్రా మాట్లాడుతూ ఐదేండ్లు ఎమ్మెల్యేగా, ఎంపీగా పని చేసిన వారు పెన్షన్ పొందుతుండగా, మూడు దశాబ్దాలు ప్రభుత్వ ఉద్యోగులకు సీపీఎస్‌ను రుద్దడం సరికాదని అన్నారు. ఈ సమావేశంలో సంస్థ వర్కింగ్ ప్రెసిడెంట్ కత్తి నర్సింహారెడ్డి, సెక్రటరీ జనరల్ సదానందంగౌడ్, జోసఫ్ సుధీర్ బాబు, అన్సారీ, ఎల్ సాయిశ్రీనివాస్, ఎం రఘునాథ రెడ్డి, పర్వత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆస్ట్రేలియాలో 'ఇంజినీరింగ్'పై అధ్యయనం

హైదరాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ) : ఇంజినీరింగ్ విద్యావిధానంపై అధ్యయననానికి తెలంగాణ విద్యావేత్తల బృందం ఆదివారం ఆస్ట్రేలియాకు బయలుదేరింది. గవర్నమెంట్ ఆఫ్ వెస్టన్ ఆస్ట్రేలియా ఆహ్వానం మేరకు గ్లోబల్ ఎడ్యుకేషన్ కెరీర్ ఫోరం భాగస్వామ్యంతో రాష్ట్రానికి చెందిన నలుగురు ఇంజినీరింగ్ కాలేజీల ప్రిన్సిపాళ్లు వారం రోజుల పాటు ఆస్ట్రేలియాలో పర్యటించనున్నారు. ఈ బృందంలో ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ పూర్వ ప్రిన్సిపాల్ శ్రీరామ్ వెంకటేశ్‌తో పాటు ఎంజీఐటీ, వీఎన్నార్ విజ్ఞానజ్యోతి, గోకరాజు రంగరాజు ఇంజినీరింగ్ కాలేజీల ప్రిన్సిపాళ్లు ఉన్నారు.

27, 28 తేదీల్లో ఫ్యాకల్టీ ఓరియంటేషన్

23లోగా రిజిస్ట్రేషన్లు • జేఎన్‌టీయూ వెల్లడి

హైదరాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ): జేఎన్‌టీయూలోని డైరెక్టరేట్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్స్ ఆధ్వర్యంలో ఈ నెల 27, 28 తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఫ్యాకల్టీ ఓరియంటేషన్ ప్రోగ్రామ్ నిర్వహించనున్నారు. వాద్వానీ ఫౌండేషన్‌తో జేఎన్‌టీయూలోని న్యూ అడ్మిషన్ బ్లాక్‌లో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నారు. దీనికి హాజరయ్యేందుకు ఈ నెల 23లోగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు.

ఆలిండియా పోలీస్ బ్యాడ్మింటన్ టోర్నీ ప్రారంభం

హైదరాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ) : 16వ ఆలిండియా పోలీస్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను హైదరాబాద్‌లోని పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఆదివారం ప్రారంభించనట్లు హోంగార్డ్స్ వెల్ఫేర్ అండ్ స్పోర్ట్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఏడీజీ స్టీఫెన్ రవీంద్ర వెల్లడించారు. 17 నుంచి 22వ తేదీ వరకు ఆలిండియా పోలీస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ పోటీలకు తెలంగాణ ఆతిథ్యమిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐజీలు చంద్రశేఖర్ రెడ్డి, విశ్వ ప్రసాద్, డీఐజీ గజరావు భూపాల్, టెక్నికల్ డైరెక్టర్ ఎండీ మక్దూమ్ అహ్మద్, చీఫ్ రిఫరీ రామకృష్ణయ్య, డై రిఫరీ వెంకటేశ్వర్‌రావు, మ్యాచ్ కంట్రోలర్ పీవీఎల్ కుమార్, టీమ్ మేనేజర్లు పాల్గొన్నారు.

టెమ్రిస్ బోర్డు పునర్వ్యవస్థీకరణ

గవర్నింగ్ బాడీ నుంచి చీఫ్ ప్యాట్రన్ హోదా తొలగింపు

హైదరాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర మైనార్టీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ (టెమ్రిస్) బోర్డు గవర్నింగ్ బాడీలో ప్రభుత్వం పలు మార్పులు చేసింది. ఈ మేరకు ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో గురుకుల బోర్డుకు చైర్మన్, చీఫ్ ప్యాట్రన్, వైస్ చైర్మన్, మెంబర్ కన్వీనర్‌తోపాటు ఏడు గురు సభ్యులు ఉండేవారు. ప్రస్తుతం గురుకుల బోర్డులో చీఫ్ ప్యాట్రన్ పదవిని తొలగించింది. మొత్తం 10 మందితో బోర్డును పునర్వ్యవస్థీకరించింది.

డీహెచ్‌కు లంచం.. ఆడియోపై విచారణ?

హైదరాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ): వైద్యశాఖలో అవినీతిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్టు తెలిసింది. తన డిప్యూటేషన్ కొనసాగింపునకు ఏకంగా డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ (డీహెచ్)కు లంచం ఇచ్చానని ఓ ఉద్యోగిని సంభాషించిన ఆడియో ఇటీవల వైరల్ అయిన సంగతి తెలిసిందే. దీనిపై ప్రభుత్వం అంతర్గత విచారణ మొదలుపెట్టినట్టు తెలిసింది. ఉద్యోగుల రిలీవింగ్ ఆర్డర్ల కోసం మెదక్ జిల్లా డీఎంహెచ్‌వో కార్యాలయ సిబ్బంది 30 వేల వరకు వసూలు చేస్తున్నట్టు ఆ ఆడియోలో ఉంది. ఈ ఘటనపై డీహెచ్ గతంలోనే స్పందించారు. ఉన్నతాధికారులపై తప్పుడు ఆరోపణలు చేశారని కారణంతో ఆ ఉద్యోగినిని సస్పెండ్ చేశారు. అయితే ఆ ఉద్యోగిని వివరణ తీసుకోకుండానే సస్పెండ్ చేయడంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. వైద్యశాఖలో ఏకంగా ఉన్నతాధికారిపైనే ఆరోపణలు రావడంతో రిటైర్డ్ ఐఏఎస్ అధికారితో విచారణ జరుపాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్టు విశ్వసనీయవర్గాలు తెలిపాయి.

ఆలయంలో స్వామి, అమ్మవార్ల ఎదుర్కోలు మహోత్సవం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు, అధికారులు

నయనానందకరం.. ఎదుర్కోలు సంబురం

- జగన్మోహిని అలంకారంలో యాదగిరీశుడి దర్శనం
- నేడు రాత్రి 8:45 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం

యాదగిరిగుట్ట, మార్చి 17: యాదగిరిగుట్టలో స్వయంభువుగా వెలిసిన నృసింహస్వామితో.. శ్రీమహాలక్ష్మి అమ్మవారికి ముక్కోటి దేవతల సాక్షిగా బ్రహ్మోత్సవ తిరుకల్యాణ సుముహూర్త ఎదుర్కోలు మహోత్సవం ఆదివారం రాత్రి నయనానందకరంగా సాగింది. తూర్పు రాజగోపురం ఎదురుగా తిరుమాడవీధుల్లో స్వామి, అమ్మవార్ల ఎదుర్కోలు మహోత్సవాన్ని వేదమంత్రాలతో వైభవంగా నిర్వహించారు. అలంకార నరసింహుడిని అశ్వవాహనంపై ప్రధానాలయ కల్యాణ మండపం నుంచి ఉత్సవ మండపానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. స్వామివారిని తూర్పునకు అభిముఖంగా, అమ్మవారిని పశ్చిమ దిశకు అభిముఖంతో ఎదురెదురుగా ప్రతిష్ఠించారు. ఇరువైపులా అధికారులు, అర్చకులు, రుత్విక్కులు ఆసీనులై పెళ్లి పెద్దలుగా వ్యవహరించారు. అలంకార సేవోత్సవంలో భాగంగా స్వామివారు ఉదయం 9 గంటలకు జగన్మోహిని రూపంలో తిరుమాడవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా స్వామివారికి తిరుమల తిరుపతి దేవస్థాన ఉప కార్య నిర్వహణాధికారి లోకనాథం, పర్యవేక్షకులు సురేశ్, అర్చకులు, అధికారులతో కలిసి యాదగిరిగుట్ట దేవస్థానం అనువంశిక ధర్మకర్త బీ నరసింహమూర్తి, ఈవో భాస్కర్‌రావుకు సంప్రదాయబద్ధంగా మేల్చాట్ పట్టు వస్త్రాలను అందజేశారు.

నేడు రాత్రి తిరుకల్యాణోత్సవం

యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాలలో ముఖ్య ఘట్టమైన లక్ష్మీనరసింహస్వామివారి తిరుకల్యాణ మహోత్సవం సోమవారం రాత్రి 8:45 గంటలకు అంగరంగ వైభవంగా జరుగనుంది. ఇందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కల్యాణ వేదిక ముందు భాగంలో వీవీఐపీ, వీఐపీ, మీడియా, దాతలు, దేవస్థాన అధికారులు, కల్యాణంలో పాల్గొనే భక్తులకు వేర్వేరుగా ప్రత్యేకమైన లాబీలను ఏర్పాటు చేస్తున్నారు. స్వామివారి కల్యాణోత్సవాన్ని 10 వేల మంది వీక్షించే విధంగా ఆలయ అధికారులు కొండపైన 8 ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాట్లు చేస్తున్నారు.

5 నిమిషాలు ఆలస్యమైనా ఓకే!

- ఎస్సెస్సీ విద్యార్థులకు గ్రేస్ టైమ్
- నేటి నుంచే పదో తరగతి పరీక్షలు
- ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం

హైదరాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పదోతరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఐదు నిమిషాలు అదనంగా గ్రేస్ టైమ్ ఇచ్చారు. అంటే విద్యార్థులను ఉదయం 9.35 గంటల వరకు పరీక్షాకేంద్రాల్లోకి అనుమతిస్తారు. విద్యార్థులు సాధ్యమైనంత ముందుగా పరీక్షాకేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఉదయం 8.30 గంటల నుంచే పరీక్షాకేంద్రాల్లోకి అనుమతిస్తారు. విద్యార్థులు పేపర్లు, ఇతరత్రా పత్రాలను వెంట తీసుకెళ్లకూడదని అధికారులు సూచిస్తున్నారు. మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే డిబార్ చేస్తామని హెచ్చరిస్తున్నారు. ఎస్సెస్సీ పరీక్షలకు హాజరయ్యేవారికి ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించింది. హాల్‌టికెట్ చూపిస్తే ఎక్కడి నుంచి ఎక్కడికైనా ప్రయాణం చేసే అవకాశాన్నిచ్చింది. ఈ సౌకర్యాన్ని సెలవు రోజుల్లోనూ వినియోగించుకోవచ్చని అధికారులు తెలిపారు. ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో కాంబినేషన్ టికెట్‌తో ప్రయాణం చేయవచ్చని వెల్లడించారు.

నిబంధనలు, సూచనలు

- విద్యార్థులు హాల్‌టికెట్లు వెంట తీసుకెళ్లాలి. లేదంటే పరీక్షకు అనుమతించరు.
- ఇన్విజిలేటర్లకు లాటరీ విధానం ద్వారా గదులు కేటాయిస్తారు.
- అమ్మాయిలను మహిళా ఉపాధ్యాయులు తనిఖీలు చేస్తారు.
- విద్యార్థులకిచ్చే మ్యాప్‌లు, గ్రాఫ్‌లపై ఇన్విజిలేటర్లు సంతకం చేయాలి.
- పరీక్ష రాయడం పూర్తయిన తర్వాత చివరి పేజీలో విద్యార్థులతో ది ఎండ్ అని రాయించి ఇన్విజిలేటర్లు సంతకం చేయాలి.
- ఇన్విజిలెటర్లు సొంతంగా సీటింగ్ ఏర్పాట్లు మార్చరాదు.
- ఒకే పాఠశాల విద్యార్థులు తరుచూ ఆలస్యంగా వస్తే సీఎస్‌డీవోకు ఫిర్యాదు చేయాలి.
- ఒకరికి బదులుగా మరొకరు పరీక్ష రాసినా సీఎస్‌డీవోలకు తెలపాలి.

ఏప్రిల్ 3 నుంచి మూల్యాంకనం

పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనాన్ని ఏప్రిల్ 3 నుంచి 11 వరకు నిర్వహిస్తారు. మొత్తంగా 9 రోజులపాటు స్పాట్ వాల్యుయేషన్‌ను నిర్వహించనున్నట్టు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు తెలిపారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 19 స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మార్చి 23న వాల్యుయేషన్ సిబ్బందికి ఓరియంటేషన్‌ను నిర్వహిస్తామని తెలిపారు. 11 పేపర్ల నుంచి 6 పేపర్లకు కుదించడంతో జవాబు పత్రాల సంఖ్య తగ్గనున్నది. దీంతో మూల్యాంకనాన్ని త్వరగా పూర్తిచేసి, ఫలితాలను త్వరగా విడుదల చేయాలని అధికారులు భావిస్తున్నారు.

కొండగట్టు లీజులో గోల్‌మాల్

- ఆలయ దుకాణాల టెండర్ సొమ్ములో రూ.11.20 లక్షలు హాంఫట్
- వసూలు చేసి ఆలయానికి చెల్లించని వైనం
- ఈవోను పక్కదారి పట్టించి నోడ్యూస్ సర్టిఫికెట్ల జారీ
- అక్రమార్కులపై చర్యలకు రంగం సిద్ధం

మల్యాల, మార్చి 17: కొండగట్టు అంజన్న క్షేత్రంలో దుకాణాల లీజు సొమ్ముల వసూళ్లలో రూ.11.20 లక్షల గోల్‌మాల్ జరిగింది. దుకాణాదారుల నుంచి వేలం డబ్బులు వసూలు చేసి, ఆలయానికి చెల్లించకుండానే సదరు నిర్వాహకులకు నోడ్యూస్ సర్టిఫికెట్లు జారీ చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొండగట్టు అంజన్న క్షేత్రంలో పలు రకాల వస్తువులు అమ్ముకునేందుకు ఏటా దుకాణాల నిర్వహణ హక్కులను వేలం వేస్తుంటారు. కొబ్బరి కాయలు, పూలు, పండ్లు, పాదరక్షల సేకరణ, టెంట్ హౌస్ నిర్వహణ, వంట చెరుకు విక్రయం, హోటల్, సులభ్ కాంప్లెక్స్ నిర్వహణ, భక్తులు కొట్టిన కొబ్బరి కాయల ముక్కల సేకరణకు సంబంధించిన హక్కులను ఏడాది కాలపరిమితితో టెండర్లు నిర్వహించి ఎక్కువ కోట్ చేసిన వారికి కట్టబెడతారు. హక్కులు దక్కించుకున్నవారు దుకాణం ప్రారంభ సమయానికి ముందుగానే నిర్ణీత వేలం సొమ్ములో 50 శాతం చెల్లించి దుకాణం పొందాల్సి ఉంటుంది. దుకాణం పొందిన నెల రోజుల వ్యవధిలోపే మిగతా 50 శాతం చెల్లించాలనే నిబంధన ఉన్నది. కొన్నేండ్లుగా దుకాణదారుల నుంచి లీజు మొత్తాలను వసూలు చేయడంలో ఆలయ అధికారులు జాప్యం చేస్తున్నారు.

నమోదుకాని నగదు

అంజన్న క్షేత్రంలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి నాలుగు దుకాణాలకు సంబంధించి లీజు సొమ్ము పక్కదారిపట్టింది. దుకాణాదారుల నుంచి లీజు సొమ్ము రూ.11.20 లక్షలు ఆలయ సిబ్బంది వసూలు చేశారు. ఆ డబ్బును బ్యాంక్‌లో జమచేయలేదని, వాటి వివరాలను ఆలయ నగదు పుస్తకంలో నమోదు చేయలేదని తెలిసింది. అక్కడితో ఆగకుండా సదరు దుకాణాదారులు 2023-24కు దుకాణాల లీజు వేలంలో పాల్గొనేందుకు నో డ్యూస్ సర్టిఫికెట్లను సైతం జారీ చేసిన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. డబ్బులు వసూలైనట్టు డిమాండ్ కలెక్షన్ బుక్, నోట్‌ఫైల్‌లో కిందిస్థాయి సిబ్బంది సంతకాలు చేసి మరీ ఈవోతో నో-డ్యూస్ సర్టిఫికెట్లు జారీ చేయించినట్టు తెలుస్తుండగా, ఈ విషయాన్ని ఉన్నతాకారులు సీరియస్‌గా తీసుకున్నట్టు తెలిసింది. ఇప్పటికే 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను పలు దుకాణాల నుంచి నగదును వసూలు చేసి ఆలయానికి జమచేయని విషయంలో ఓ ఉద్యోగిని సస్పెండ్ అయిన ఘటన మరువక ముందే తాజాగా రూ.11.20 లక్షలు స్వాహా విషయం బయటపడటం కలకలం రేపుతున్నది.

అవినీతిని ఉపేక్షించేది లేదు..

అంజన్న ఆలయ ఉద్యోగుల అవినీతిని ఉపేక్షించేది లేదు. ఇప్పటికే రూ.37.90 లక్షల స్వాహా విషయంలో ఒకరిని సస్పెండ్ చేయడంతోపాటు క్రిమినల్ కేసు పెట్టాం. తాజాగా రూ.11.20 లక్షల స్వాహా విషయం బయట